# యేసునాయక శతకము

# JESUS THE SINNER'S REFUGE

రెవ. పురుషోత్తమ చౌధరి కవికృతము.

# విషయసూచిక


| | పద్యముల సంఖ్య |
|---|---|
| శ్రీ యేసు స్తోత్రము ... ... ... ... | 65 |
| భక్తుని పశ్చాత్తాపము ... ... ... ... | 65 |
| మనుష్యుని అనిత్యత ... ... ... ... | 75 |
| పాపమువలన దుర్గతి ... ... ... ... | 78 |
| మనసు చంచలము ... ... ... ... | 81 |
| విగ్రహారాధనాదుల వ్యర్థత ... ... ... | 82 |
| నరకము తప్పించుకొను సాధనము ... ... ... | 84 |
| సత్యమైన ప్రాయశ్చిత్తము ... ... ... | 85 |
| ప్రభువు మరణమువలని పుణ్యము ... ... ... | 87 |
| ప్రభువుయొక్క ఉచితమగు కృప ... ... ... | 90 |
| ప్రార్థన స్తోత్రములు ... ... ... ... | 92 |
| సత్క్రియలవలననే మోక్షము కలుగదు ... ... ... | 98 |
| అన్య దేవతలయెడల భక్తుని విరక్తి ... ... ... | 99 |
| భక్తుని మనో సుఖము ... ... ... ... | 99 |
| ప్రభు నామ విజయము ... ... ... ... | 103 |

# యేసునాయక శతకము

1. శ్రీకరమై సుధీజనవశీకరమై నిజభక్త నిత్యసౌ ఖ్యా
కరమై సమస్త జగదావన పావన రక్తసిక్త శో భాకరమై చెలం
గెడు భవత్పద పద్మము లాశ్రయించి నే ప్రాకట భక్తితో
గొలుతు బాయక యెప్పుడు యేసునాయకా.

## తాత్పర్యము

ధన్యత నిచ్చునవియై, మంచి మనస్సుగలవారికి స్వాధీనము లైనవయి, తన భక్తుల నిత్యసుఖమున కాధారములయి, యావత్తులోకముయొక్క పాపములను పోగొట్టునట్టి రక్తముతో కూడి ప్రకాశించునట్టి నీ పాదపద్మముల నాశ్రయించి నిష్కపటమగు భక్తితో ఎల్లప్పుడును గొల్చెదను, ఓ యేసునాయకా ॥

## భక్తుని పశ్చాత్తాపము

2. భారముతో ప్రయాసముల బొల్పడువారలు నాదు
పజ్జకిం పారగ రండు మీ యలత మాన్పెదనంచును బిల్చు
నీ కృపా సారము చిల్క వాక్యము విచారముచేసి మదీయ
పాప వి స్తారభరంబుతో సిలువ దాపుకు వచ్చితి యేసు
నాయకా.

## తాత్పర్యము

భారములు మోయలేక కష్టపడుచున్న వారలారా, నా వద్దకు రండి, మీ యలసట తీర్చెదను అని చెప్పుచున్న నీ కృపను ప్రసరించు నీ వాక్యమును ఆలోచించుకొని, విస్తారమయిన నా పాపముల భారముతో నీ సిలువవద్దకు వచ్చితిని । యేసునాయకా ॥

3. ఎంతటి పాపియైనను ఒకించుక సంశయమాత్ర లేక నీ
చెంతను జేరి ప్రార్థనలు సేయగ నీవది జూచి తస్మన, శ్శాంతి

యొనర్చి సజ్జనుల సంగతిగూర్చి యణంచి పాపముల్ సంతస
మిచ్చి బ్రోతువని చాటునుశాస్త్రము యేసునాయకా.

### తాత్పర్యము

ఎటువంటి ఘోరపాపియైనను సరే, యే మాత్రము అనుమానము మనస్సులో పెట్టుకొనకుండా నీయొద్దికివచ్చి ప్రార్థనచేసితే అది నీవు చూచి, వారి మనస్సులకు నెమ్మదియిచ్చి నీ భక్తులతో సాంగత్యము దయచేసి, పాపములను పోగొట్టి, మనస్సులో సంతోషము కలుగజేయుదువని నీ వాక్యము చెప్పుచున్నది । యేసునాయకా ॥

4. నేను దురంతపాతకుడ నేను దురాత్ముడ నేను క్రూరుడ
న్నేను మహాపరాధినిదె నేను కృతఘ్నుడ నేను నీచుడం,
దీనుడనయ్య నేను భవదీయ దయామృత వృష్టి నాపయిన్
మానుగబంపి నా మనసు మార్పడజేయవె యేసునాయకా.

### తాత్పర్యము

నేను ఘోరపాపిని, చెడిపోయిన ఆత్మగలవాడను, క్రూరుడను, గొప్ప అపరాధిని, కృతజ్ఞతలేనివాడను, నీచుడను, దీనుడను, నామీద నీ కృపయనే అమృతవర్షము కురిపించి నా హృదయమును మార్చుమా । యేసునాయకా ॥

5. కాపురుషాళి కగ్రజుడ కల్మషరాసుల పెంట భూరి సం,
తాప దురంత చింతలకు తావగువాడన మార్గదుర్గుణ, ప్రాపకు
డన్మహానరక పాత్రుడనో కరుణాపయోధి నీ దాపున జేరినాడ
తవ దాస్యమొసంగవె యేసునాయకా.

### తాత్పర్యము

పాపాత్ముల సమూహములో మొదటివాడను, పాపరాసియనే పెంట కుప్పను, విస్తారమగు దుఃఖములకు చెడు ఆలోచనలకు ఉనికియయినవాడను, పనికిరాని దుర్గుణములకు ఆధారమును, ఘోరనరకమునకు పాత్రుడను. ఓ కృపాసముద్రుడా, నీ యందజేరినాను, నీసేవ దయచేయుమయ్యా । యేసు నాయకా ॥

6. విడిచితి పారమార్థిక వివేకము సద్గతిదెల్పు శాస్త్రము
నడిచితి దుష్టనైజయుత మద్హృదయాచరణానుసారినై నడిచితి
సత్యశాంత సుగుణంబుల బారగదోలి దుఃఖముల్ గుడిచితి
నింక నీ శరణుగోరితి జేరితి యేసునాయకా.

తాత్పర్యము

పరమార్థములయెడల నుండిన వివేకమును విడిచిపెట్టితిని, మోక్షమార్గమును చూపించు వేదగ్రంథమును చదువుట మానితిని; దుష్టస్వభావముతో గూడిన నా హృదయము ననుసరించి నడుచుకొంటిని, సత్యము శాంతము మొదలయిన సుగుణములను పోగొట్టుకొని దుఃఖముల ననుభవించితిని; అయితే ఇప్పుడు నీ శరణుగోరి నీ యొద్దికి వచ్చినాను । యేసునాయకా ॥

7. మరచితి దేవవాక్యములు మత్సర కామవికారవిద్యలం
గరచితి దుష్కృతవ్రతము కానొనరింప పిశాచిచెయ్యినే జర
చితి చెప్పతీర నగసాట్లకు పాలయి సారె కక్కటా, బరచితి
దిక్కులేకిపుడు వచ్చితి నీదరి యేసునాయకా.

తాత్పర్యము

దేవుని వాక్యములను మరచిపోతిని; కామక్రోధ మత్సరాది దుష్టవిద్యలను నేర్చితిని; చెడ్డకార్యములను చేతునని సాతానుకు చేతిలో చెయ్యి వేసితిని; చెప్పనలవికాని కష్టములపాలయి, అయ్యో పరుగెత్తితిని; యిప్పుడు వేరేదిక్కులేక నీ చెంత చేరితిని । యేసునాయకా ॥

8. అనుపమ చిత్తశాంతిసుఖ మారడిబుచ్చితి నిత్యముక్తి
సా ధన ధనరాశి వోగొడితి ధైర్యమహాఫల భూరుహంబు
ఖండన మొనరించితిన్ గటకటా కడు మూర్ఖుడనైతి నేను నీ
మనసిక నన్నుబట్టి బరిమార్తువొ బ్రోతువొ యేసునాయకా.

తాత్పర్యము

దేనితో సమానములేని మనోనెమ్మది సౌఖ్యము పోగొట్టుకొంటిని; నిత్యమయిన రక్షణకు సాధనమగు ధనరాశిని పాడుచేసికొంటిని; ధైర్యమును శ్రేష్ఠ

మైన ఫలములుగల వృక్షమును పడగొట్టివేసితిని; అయ్యయ్యో, బహు మూఢు డనైపోతిని; నీ చిత్తము, ఇక నన్ను చంపుదువో, రక్షింతువో। యేసునాయకా॥

9. వీసము సేయరానిమెయి వీరడి సౌఖ్యముగోరి భద్రవి,
శ్వాసము పాడుచేసి విలసన్మృదు చిత్తము నల్లరాయిగా, జేసి
మహా పరాధములు చేసితి నీ సముఖంబునందు నా, దోసము
లెంచి నీ దయను దూరముసేయకు యేసునాయకా.

### తాత్పర్యము

దమ్మిడికయిన పనికిరాని పిచ్చిసౌఖ్యమును ఆశించి, మంగళప్రదమయిన విశ్వాసమును పాడుచేసికొని, చక్కని మృదువైన మనస్సును కఠినపరచుకొని, ఘోరపాపములు నీ యెదుట చేసితిని; నా పాపములు లెక్కలోకి తెచ్చి నీ దయచూప మానవద్దు। యేసునాయకా॥

10. ఆదరణీయమైన విమలాత్మయు నన్నెడబాసిపోయె జ్ఞా,
నోదయమైన దేవవచనోజ్వల దీపులడంగె మానసా, చ్ఛాదిత
మయ్యె నంధతమసంబు భవత్పద భక్తి వీడనా, కీ దురవస్థగూడె
నిక నెయ్యది నెమ్మది యేసునాయకా.

### తాత్పర్యము

ఆదరణకర్తయగు పరిశుద్ధాత్మ నన్ను విడిచిపోయెను, జ్ఞానమును వృద్ధి చేయు దేవుని వాక్యముయొక్క ప్రకాశత నాకు తగ్గిపోయెను; చీకటి నా మనస్సును కమ్మెను; నీ పాదములందలి భక్తి విడిచిపెట్టినందునగదా నాకీ దుర్గతి పట్టినది; నాకిక నెమ్మది యెక్కడిది। యేసునాయకా॥

11. కుటిలమనంబు గూర్చికొని కుంఠితబుద్ధి వహించి
మాయ లం, పట కపట ప్రవర్తనలు బాగుగనేరిచి నోట తేనె
హృ, ద్ఘటమున దుర్విషంబిడి వృథా నిజభక్తికి వేషమెత్తినే, గట
కట మోసపోతి నను గావవె యిప్పుడు యేసునాయకా.

## తాత్పర్యము

కపటమైన మనస్సుపెట్టుకొని, వంకరబుద్ధి నిల్పుకొని, వేషధారణతో కలిసిన కపటపు ప్రవర్తన పూర్తిగా నేర్చుకొని, నోటితో తియ్యనిమాటలు పలుకుచు హృదయములో విషముపెట్టుకొని, నిజమయిన భక్తిలేక వ్యర్థమయిన భక్తివేషము వేసికొని మోసపోతినయ్యా; నన్నిప్పుడు రక్షించు । యేసునాయకా॥

12. దబ్బరలాడి యాడి గురి దప్పిన మాటల గోడు చూపి
నీ, నిబ్బరమైన భక్తులను నీచులగా మదినెంచి మించినే, నుబ్బుడు
కాడనై గరువ మున్నతిజేయుచు పాపినైతి నా, యబ్బ త
వాంఘ్రి దాస్యమిపు డబ్బగజేయవె యేసునాయకా.

## తాత్పర్యము

బడాయి మాటలును, స్థిరములేని పలుకులును పలుకుచు, స్థిరవిశ్వాసము గల భక్తులను హీనముగా చూచుచు, ఎంతో గర్వముగలవాడనయి పాపము చేసితిని; ఓ తండ్రీ, యిప్పుడు నీ పాదసేవ నాకు దయచేయుమయ్యా। యేసునాయకా॥

13. ఎఱిగి యెఱింగి పాపము లనేకముజేయను మాటిమాటి
కిన్, పరుగులు వెట్టిపోతి తవ భక్తజనోత్తము లిచ్చు బోధలు,
న్వీరుచు నింద్రియార్థముల వెంటను నంటుచు బోయితి న్నహా,
నరకుడనై తుదింజెడితి నమ్మిక వీడితి యేసునాయకా.

## తాత్పర్యము

ఎన్నో పాపములు ఎరిగి బుద్ధిపూర్వకముగానే మళ్లీమళ్లీ చేయుటకు పరుగెత్తిపోతిని, నీ భక్తశ్రేష్ఠులు చేయు ఉపదేశములు మీరి, దురాశల వెంట బడి పోవుచుంటిని, ఘోరనరక పాత్రుడనయితిని, చివరకు విశ్వాసము పోగొట్టుకొని చెడిపోతినయ్యా। యేసునాయకా॥

14. నమ్మినవారికెల్ల నపనమ్మిక నాయెడ గల్గజేసితిన్, నెమ్మది
నుండువారలకు నేత్రజలంబులు నిండజేసితిన్, కుమ్మరి సారెకైవ

డిని గ్రుమ్మరితిన్ మదినిల్పలేక నీ, సమ్మతమేమి నన్నికను
చంపెదో పంపెదో యేసునాయకా.

### తాత్పర్యము

నను నమ్మినవారికి నామీద నమ్మకములేకుండ చేసికొంటిని, విచారము లేకుండా నేను వారికి కన్నీళ్లు (దుఃఖము) కలుగజేసితిని, మనస్సు స్థిరముగా నుంచుకోలేక కుమ్మరివాని సారెవలె అటునిటు తిరిగితిని; నీ చిత్తమేమో, నన్ను చంపుదువో, రక్షింతువో। యేసునాయకా॥

15. తప్పులులేనివారొకరు ధాత్రినిలేరని దేవవాక్యముం,
జెప్పుట నిక్కమట్టి నర జీవులలోపల నాకు మించబల్, తప్పులు
సేయువాడొకడు ధారుణి నారయలేడు నేడు నా, తప్పులబాపి
నీ కరుణ దప్పక బ్రోవవె యేసునాయకా.

### తాత్పర్యము

తప్పులు చేయనివారు భూలోకములో లేనేలేరని దేవునివాక్యము చెప్పు మాట నిజమే; అట్టి నరులలో నాకంటె ఎక్కువ పాపములు చేయువాడు ఈ లోకములో మరియెవరు లేరు; అయితే ఈ దినము నా పాపములు పోగొట్టి నీ కృపచూపి రక్షించుము। యేసునాయకా॥

16. సాధుజనావనా వినుము సజ్జన నిందితమైన విగ్రహా,
రాధకవంశ జన్ముడ నిరంతర పాపవిచార దుష్ట వి, ద్యాధిక నైపు
ణుండ చరితార్థములేని తమిస్రశాస్త్ర దు, ర్గాధల గ్రుంకినాడ
నను గావవె యిప్పుడు యేసునాయకా.

### తాత్పర్యము

సాధుజనులకు అధీనుడవైనవాడా. నా మనవి వినుము; సజ్జనులు నిందించు విగ్రహారాధనచేయువారి వంశమున బుట్టినవాడను, ఎల్లప్పుడు పాపపు ఆలోచనలను చెడువిద్యలో బహు నేర్పుగలవాడను, మెచ్చుకొనదగినదికాని పాపాంధకారపు శాస్త్రపు గాధలలో మునిగినవాడను, ఇప్పుడు నన్ను రక్షించుమయ్యా। యేసునాయకా॥

17. పువ్వుల దోటలో బెరుగు బూరుగ వృక్షము భంగి నందమా, గువ్వలమందలో మెలగు ఘూకము పోల్కి త్వదీయ సంఘమం, దివ్విధముండి నేను కపటేచ్ఛలకాలము బుచ్చి యకటా, నెవ్వల పాలుగాబడుచు నీచతనొందితి యేసు నాయకా.

## తాత్పర్యము

పువ్వులవనములో పెరిగే బూరుగచెట్టువలెను, చక్కని గువ్వలగుంపులో చేరిన గుడ్లగూబవలెను, నీ సంఘములో నేనుంటిని; కపటపు ఆశలలో నా కాలముగడుపుచు కష్టములపాలయితిని, ఇతరులవల్ల నీచముగా నెంచబడితిని; అయ్యయ్యో । యేసునాయకా ॥

18. పొల్లుల మూట విప్పు గతి భూజను లెంచిరి నా చరిత్రమున్, కుళ్లిన మాంసరాశిగతి కొందరికయ్యె మదీయ కృత్యముల్, ముల్లుదు సిల్లు రీతి బుధ ముఖ్యులలో మమ నామమిట్లునే, నెల్లిదమైతి నక్కట మహీజనమంతెట యేసునాయకా.

## తాత్పర్యము

నా ప్రవర్తనను లోకులు ఎందుకు పనికిరాని పొల్లుగా భావించిరి, కొందరికి నా పనులు మురిగిపోయిన మాంసమువలె అసహ్యముగా తోచెను; సజ్జనులలో నా పేరు అంటే గసికముల్లు గుచ్చుకొన్నట్టు కష్టముగానుండెను; లోకములోని జనులకందరికి నేను అసహ్యుడనైపోతిని, అయ్యో । యేసు నాయకా ॥

19. వాకిటికుళ్లు పెంటగతి వర్జితమై బడు కసుఱురీతి యీ, లోకమునందు నీ కృపకు లోబడు క్రైస్తవ లోకమందున, స్వీకరమైతి నన్ను వెలిచేసిరి యింకెటు వోదునయ్యరా, వే కరుణానిధీ మనుపవే శరణార్థిని యేసునాయకా.

## తాత్పర్యము

ఇంటివాకిట పారవేయబడి మురిగిపోయిన పెంటవలెను, కక్కిన ఆహారమువలెను నేను ఈ లోకమునందు నీ కృపపొందిన క్రైస్తవ జనులకు వారితో చేర్చుకొనన నర్హుడను కాకపోతిని; వారు నన్ను తమలోనుండి వెలివేసిరి; ఇక నే నెక్కడికి బోదునయ్యా, కృపాధారుడా, రావయ్యా, నీ శరణుగోరి వచ్చిన నన్ను బ్రతికించుమయ్యా। యేసునాయకా॥

ఉ॥ మా॥ 20. హా యిక నేమిసేయుదు మదంతర నేత్రము మ్రోల రేబగల్, బాయక నస్మదీయమగు పాపము రూపము దాల్చి నిల్చెన, య్యో యిది బారదోల నెవరోపుదు రెయ్యది దిక్కు నాకు నో, పాయము నీవె నీ సిలువ ప్రాపకమే గతి యేసు నాయక.

## తాత్పర్యము

అయ్యో, యిక నేనేమి చేతును? రాత్రింబగలు నా మనోనేత్రము ఎదుట నేను చేసిన పాపము స్వరూపముతో వచ్చి విడువకుండా నిలిచి యున్నది. దీనిని పారదోలుటకు ఎవరిచేత నవును? నా కెవరు దిక్కు! నీవే నాకు ఆధారము; నీ సిలువయే నాకు శరణ్యము। యేసునాయకా॥

ఉ॥ మా॥ 21. మెట్టల దొంతి చీమ తల మీదను పాదుగ నున్న రీతిని, ట్టట్టు మెదల్పరాని మరణాయత దుష్కృత భూరి భారము, న్నట్టిమదీయ మానసము పై భరమోర్వగలేక బొబ్బలు, న్బెట్టుచు నిన్ను జేరితిని విశ్రమమియ్యవె యేసునాయకా.

## తాత్పర్యము

చీమ తలమీద కొండమీద కొండ పేర్చి పెట్టినట్టుగా ఇటునటు కదలింప వీలుగాకుండా మరణ కరమయిన పాపముల భారము నా మనసుమీద పడి అణచుచున్నది, ఈ భారము మోయలేక మొరపెట్టుచు నీ కడకు వచ్చి చేరితిని; నాకు విశ్రాంతి దయచేయుము। యేసునాయకా॥

22. ఉల్లను దల్లడిల్లె మది నోపని తాపము మోపు
లయ్యె వ, ర్ధిల్లెననూన దుఃఖములు దీనదశల్ బసకట్టి నిల్చె
నా, కెల్లెడ మృత్యుహేతువయి తిప్పుడు నన్విడి పొమ్ముపావ
మా, యొల్లనటంచు జెప్పియిట వచ్చితి బ్రోవవె యేసునాయకా.

## తాత్పర్యము

నా మనస్సు గాబరా పడెను; భరింపలేని సంతాపము మనస్సులో పుట్టుకొని వచ్చెను, విస్తారములయిన దుఃఖములు నిండుకొనెను; నీచత్వము నిలువరముగా నాకు ప్రాప్తించెను; ఓ పాపమా, ఎటు చూచినను చావే నాకు తెచ్చిపెట్టితివి; ఇక నన్ను విడిచిపెట్టి పో, యిక నీవు నాకు వద్దని చెప్పి నీ సన్నిధికి వచ్చితిని। యేసునాయకా॥

23. ఎడతెగరాని మోహలత లెక్కడు దుర్మతి వృక్ష
మూలమం, దెడనెడబుట్టి చుట్టుకొని యెల్లెడ శాఖల నల్లెనం
దులో, చెడుగుణ పక్షులుం బసలు చేసెను దాని భవత్కృపా
సిచే, వడిబడ ద్రుంచి నీ నెనరు వహ్నిని గాల్చవె యేసు
నాయకా.

## తాత్పర్యము

ఇన్నన్నియని చెప్ప నలవిగాని ఆశలనే తీగెలు పాపస్వభావమును వృక్షముయొక్క వేరునుండి పుట్టి ఆవరించి నలుదిక్కుల కొమ్మలుగా వ్యాపించెను; ఆ కొమ్మలలో దుర్గుణములను పక్షులు నివాసము చేయుచున్నవి; ఆ వృక్షమును నీ కృప యను కత్తితో శీఘ్రముగా నరికి పడగొట్టి నీ ప్రేమ యను అగ్నితో కాల్చివేయుమా। యేసునాయకా॥

24. పాపములన్నిట న్మిగుల పాపము క్రీస్తు మదీయ
పాపము, న్బాపగనోపడంచు నపనమ్మిక జెందుటయే నితాంత
మా, పాప మిదేయటంచు నొక భక్తుడు చెప్పినదాలకించి నీ,
ప్రాపున జేరవచ్చితి కృపామతి బ్రోవవె యేసునాయకా.

### తాత్పర్యము

పాపములలో మహా పాపము క్రీస్తు ప్రభువు నా పాపమును పోగొట్ట లేదన్న అవిశ్వాసమే, యిదే ఘోరపాపమని యొక భక్తుడు చెప్పిన మాట విని నీ శరణు గోరి వచ్చితిని కనికరముతో నన్ను రక్షించు। యేసునాయకా॥

**25. మనుజుల చోట నాకపట మార్గమెరుంగగ నీక మద్భ్రమన్, అనుగతి జేయునట్లు జగదంతర జీవుల భావనల్ సదా, గనుగొనునట్టి దేవునికి కన్నులు మూసి భ్రమింప వచ్చునే. యిన రుచి మూయబోయిన తమిస్రము లేమగు యేసునాయకా.**

### తాత్పర్యము

మనుష్యులయెదుట నా మోసకార్యములు కనబడకుండా చేసినట్టు చేయ గలనని భ్రమపడి జగత్తులోనున్న జీవుల ఆలోచన లెల్లప్పుడు చూచుచున్న దేవునికి కానరాకుండా చేసి మోసము చేయగలనా? సూర్యుని ప్రకాశమును మూసివేయబోవు చీకటి యేమగును? । యేసునాయకా॥

**26. ఇల నెటువంటి విత్తనము విత్తునొ మానవుడట్టి సస్యమా, ఫలములె కోసికూర్చుకొను పల్కరు నేను శరీరవాంఛ వి, త్తులు వెదజల్లినాడ కడు దుఃఖ ఫలంబులు గోసి కూర్చుకో, వలసెను అయ్యయో్య యెరిగి వహ్నొడి గట్టితి యేసు నాయకా.**

### తాత్పర్యము

లోకములో మనుష్యుడు ఏ విత్తనములు విత్తునో, ఆ పంటయే ఆ పండ్లే కోసికొనునుగదా? అటువలెనే శరీరాశలనే విత్తులు వెదచల్లియున్నాను గనుక దుఃఖము కలిగించు ఫలములే అనుభవింపక తప్పదు, అయ్యయ్యో, యెరిగి యుండే నిప్పు ఒడిలో కట్టుకొంటినయ్యా । యేసునాయకా॥

27. దినకరుడంబరంబున సదీధితుడై వెలుగొందు నత్త
రిన్, కనుగవ మూసికొంచు పథి గానక బోయి యొకండు
కూప మం, దున బడె దోసమిం కెవరిదో యిటులైతిని నేన
కాదె నీ, యనుపమ బోధ త్రోసి మనసంధత జేసితి యేసు
నాయకా.

### తాత్పర్యము

సూర్యుడు ఆకాశమున పైకెక్కి తీక్షణముగా వెలుగుచున్న సమయమున నొకడు రెండు కండ్లు మూసికొని దారిగానక బావిలో పడినయెడల తప్పు ఎవరిది? నేను అట్టి పని చేసినవాడనైతిని; నీ మహా శ్రేష్ఠమయిన బోధ త్రోసివేసి నా మనస్సును చీకటిగా చేసికొంటిని గదా । యేసునాయకా ॥

28. విలువ యొనర్పరాని బలు విద్రుమమొక్కటి
యిచ్చి నల్లబొ, గ్గులు గొనురీతి నీ ప్రణుత కోమల పాదము
లంటి భక్తిచే, జెలగెడు మన్మనోమణి నొసంగి పిశాచికి నింద్రి
యార్థ దు, ష్ఫలములు గొంటి నే నకట చచ్చుట గానక
యేసునాయకా.

### తాత్పర్యము

ఇంతయని ఖరీదు కట్ట సాధ్యముగాని మహా దివ్యమయిన వజ్రమునిచ్చి దానికి బదులు నల్లని బొగ్గులు తీసికొన్నట్టు నీ స్తోత్రార్హమయిన పాదములకు సేవ చేయు భక్తితో నిండిన నా మనస్సు అనే వజ్రమును సాతానుకిచ్చి యిహ సుఖమనే కొరగాని ఫలములను తీసికొంటినే, దీని కంతము మరణమే యని యెరుగక పోతినే, అయ్యో । యేసునాయకా ॥

### మనుష్యుని అనిత్యత

29. పురుగుల చెత్తరోగముల పుట్టిన యిల్లు మలాది
కిట్టముల్, దొరగెడి యోటికుండ బహు దుఃఖలతాలికి కుంకు
టేరు భీ, కర దురితాలవాలము వికారగుణంబుల కాటపట్టు

పై, న్నరముల వృక్ష మీా తనువు నమ్మునె భక్తుడు యేసు
నాయకా.

## తాత్పర్యము

ఈ శరీరము పురుగులతో నిండిన చెత్త, రోగములకు పుట్టిల్లు, మల మూత్రాదులయిన పెంట పదార్థములు కారుచుండే ఓటికుండ, లెక్కలేని దుఃఖములకు మూలమైనది, భయంకరమైన పాపములకు సాధనమయినది, చెడు గుణములకు ఆధారమయినది; పెద్దనరములు కొమ్మలవలె నుండు వృక్షము; భక్తుడైన వాడు ఇట్టి శరీరమును నమ్ముకొనునా! । యేసునాయకా ॥

30. చంచల తుల్యమైన యిహ సౌఖ్యము గోరి నరుండు
గర్వముం, బెంచి మదించి తన్ను తన మేనినిగా దలపోయు
గాని నే, త్రాంచల మెత్తి చూడడు తరాతరముల్గడ తేరుటల్
మరో, క్కించుక సేపులో తనకు మృత్యువు డాయుట యేసు
నాయకా.

## తాత్పర్యము

ఏ మాత్రము స్థిరముకాని యీా లోక సుఖమును కోరి మానవుడు గర్వించి మదమెక్కి, తన శరీరమే తానైనట్టు ఆలోచించును, గాని తరము తర్వాత తరము గడిచిపోవుచున్నదని, మరికొంచెము కాలమునకు తనకే మృత్యువు సంభవించునని కన్నెత్తి చూచి ఆలోచింపడు । యేసునాయకా ॥

31. ఒక నిమిషార్థకాలమున నూఁపిరి యేపుదొలంగు
నంతకు, త్తుక కఫవాత పిత్తములతోడను గుర్గురు పెట్టి యింటివా,
రొక రెలుగెత్తి బిల్చిన నోహోయని బల్క నశక్యమా నొకిం,
చుక తరి జచ్చు మర్త్యుడతి చుల్కన జీవుడు యేసునాయకా.

## తాత్పర్యము

ఒక అరనిమిషములో ఊపిరిబలము తగ్గిపోయి, గొంతులో కఫవాతము ప్రవేశించి గురుగురు ధ్వని పుట్టినప్పుడు, ఇంటిలో ఎవరైన ఎంత బిగ్గరగా పిల్చి

నను ఒహోయని మారుపల్కనేరడుగదా, కొంచెముసేపులో మానవుడు చచ్చి పోవువాడని, వాని జీవమెంతో అల్పమయినదని గ్రహించడే। యేసునాయకా॥

32. శిరిగలనాడు పేదలకు జేసెడు మేలు దలంపలేక
కా, వరమున విర్రవీగు ధనవంతుడు రోగి దరిద్రులాజరుం,
బరువడి బిల్వడే నరక బాధలగుందెడు వేళ కాల మె, వ్వారికిని
హెచ్చుతగ్గు లిరువంకలనుండవె యేసునాయకా.

### తాత్పర్యము

భాగ్యమున్న దినములలో బీదలకు చేయఁగల మేలు నాలోచించక పొగరుతో ఒళ్లుమరచిన ధనవంతుడు నరకబాధతో శ్రమపడుచున్నప్పుడు, రోగముతో బాధపడిన దరిద్రుడగు లాజరును మరీమరీ పిలువలేదా? ఎంతవారికిని మంచికాలము కష్టకాలము రెండు విధములుగ నుండునుగదా। యేసునాయకా॥

33. సోదరవిత్తపత్ని సుత సుందరమందిర వాసియయ్యు
వ, న్నోదర సౌఖ్యముల్మది వినోదముసేయ బ్రమత్తుడై నరుం,
డాదటవచ్చు వార్థికమటావలి మృత్యువు జాడ జూడక, న్వేదు
రుడై చెడుం దుదిని నీదయగానక యేసునాయకా.

### తాత్పర్యము

సహోదరులు, ధనము, భార్య, బిడ్డలు, చక్కని యిల్లుగలవాడైయుండి కడుపుకు మంచి యన్నము మనస్సుకు సంతోషములు కలిగియున్నందున మదించినవాడయి యున్నప్పుడు కొంచెముకాలము తర్వాత ముసలితనము వచ్చునని ఆ మీదట మృత్యువువచ్చునని ఆలోచింపక పిచ్చివాడై నీ దయ నెరుగకయే చివరకు చెడిపోవును। యేసునాయకా॥

34. ఎల్లియొ నేడొ లేక పదియేడులనో మృతి సిద్ధ
మంచు దా, నుల్లములో నెరింగి నరుడుబ్బుచు తన్నెద మెచ్చు
కొంచుమ, త్రిల్లుచు మత్సరించుచు కృతిస్తుతిగోరుచు నిట్లు
కాలముం, జెల్లుగ జేయుగాని నిను జేరనుగోరడు యేసునాయకా.

### తాత్పర్యము

రేపో యీ దినమో లేక పదియేండ్లకో చావు తప్పదన్నమాట మనస్సులో ఎరిగియుండియు మానవుడు గర్వించుచు (తనంత వాడు లేడుగదా యని) మనస్సులో అతిశయపడుచు మదముతోను మాత్సర్యముతోను నిండుకొని, కవులు తన్ను పద్యములతో స్తుతించవలెనని గోరుచు—ఈలాగు కాలము వెళ్లబుచ్చునే గాని నీ చెంత జేరగోరడు । యేసునాయకా ॥

35. నిద్దురవేళ గాంచు కల నిక్కముగాని తెరంగున
న్గడున్, ప్రొద్దుటి మంచుబిందువుల పోడుములుండని రీతి
మోముపై, నద్దమొకింత నేపిడిన యట్టిహ సౌఖ్యములన్ని బోవు
నీ, యొద్దనె గల్గుగాదె సతతోన్నత సౌఖ్యము యేసునాయకా.

### తాత్పర్యము

నిద్రలో కన్న కల నిజము కానట్లును, ప్రొద్దుటి పూట కురియుమంచు హరించిపోయినట్లును, అద్దములో ముఖము చూచుకొని వెంటనే మరచిపోయినట్లును, ఈ లోక సౌఖ్యములన్ని మాయమైపోవును; నిత్యముండు శ్రేష్ఠమయిన సౌఖ్యము నీ సన్నిధియందె దొరుకునుగదా । యేసునాయకా ॥

### పాపమువలని దుర్గతి

36. పాపము సేయువేళ నది పండుగగా గనుగాని వెన్క-
సం, తాపము హానిదుఃఖము సదామతిచింత జనాపవాదమే,
వైపున జూడసిగ్గు బుధవర్గములో తలవంపులిట్టి పె, ల్లాపద
లొందుటల్ గనడహా నరుడాత్మను యేసునాయకా.

### తాత్పర్యము

పాపము చేయు సమయమున అది పండుగగా (సంతోషముగా) నుండవచ్చును గాని తర్వాత మనస్సులో మంట, విచారము ఎల్లప్పుడు మనస్సుకు బాధ జనులవల్ల దూషణ ఎటుచూచినను అవమానము, సజ్జనులమధ్య తలవంపు ఈ మొదలైన కష్టనష్టముల నాలోచించడే నరుడు । యేసునాయకా ॥

37. ఆకలిగొన్న బెబ్బులికి నబ్బిన దూడవిధంబు దుష్టద,
ర్వీకర భీకరోగ్రముఖ వీధిని బాధితమైన దీనమం, డూకము
భంగినెట్టి నరుడు న్విరహజ్వర పూరితాన్య కాం, తాకరవశ్యు
డైన నికదప్పునె దుర్గతి యేసునాయకా.

### తాత్పర్యము

ఎంత గొప్పవాడైనను మోహమనే జ్వరముతో నిండిన పరస్త్రీ చేతిలో చిక్కినట్టయిన, ఆకలిగొనియున్న పెద్దపులికి దొరికిన దూడవలెను విషసర్పము యొక్క భయంకరమైన నోటిలో చిక్కి బాధపొందుచున్న నీరసమగు కప్ప వలెను ఉండును; అట్టివానికి దుర్గతితప్పునా । యేసునాయకా ॥

38. శ్రేయస హాని తేజము సుశీలము బాయు యశంబు
మాయు న, న్యాయము జేరు నింద యపహాసము దూషణ ప్రాణ
హాని యా, దాయము బోవు దుర్దశకు తావగు నిట్టి పరాంగ
నాసుఖో, పాయము గోరువాని కెడబాయునె దుర్గతి యేసు
నాయకా.

### తాత్పర్యము

ఇటువంటి పరస్త్రీసంగమ సుఖము కోరువానికి క్షేమము పోవును; ముఖములో తేజస్సు మంచిస్వభావము వాని విడుచును, కీర్తి నశించును, అన్యాయము ప్రాప్తించును; నింద, నలుగురిలో నగుబాటు, దూషణ, ప్రాణహాని సంభవించును, ధనము నష్టమవును, దుర్దశ వానినిపట్టి పీడించును; వానికి దుర్గతి తప్పునా । యేసునాయకా ॥

39. అంతములేని చింతలు నితాంతముగా జనుదెంచు
చున్న పె, న్వింతలదొంతులై బెనగు వేడ్కయు నెమ్మదియుం
దొలంగు న, భ్యంతర మంతరింద్రియ సుభక్తికి చాటగు నన్య
కాంతతో, మంతన మాడువానికి సమస్తము కీడగు యేసు
నాయకా.

తాత్పర్యము

చాటున పరస్త్రీతో సహవాసము చేయువానికి లెక్కలేని విచారములు ఎడతెగక రాసులుగావచ్చి బాధించును, సంతోషమును మనస్సులో నెమ్మదియును పోవును, ఆత్మలోనుండు మంచి భక్తికి అభ్యంతరము కలుగును; సమస్తము కీడేయగును । యేసునాయకా ॥

40. సారవిహీన దుష్టజన సంగతిగోరు పవిత్రసత్య వా,
గ్ధోరణి దూరమై చను హితుండహితుండగు శాస్త్రరీతి ని, స్సా
రము జూచు క్రూరమగు చావునకైన దెగించు నన్యకాం, తా
రతు డెవ్వడాతనికి దప్పునె దుర్గతి యేసునాయకా.

తాత్పర్యము

పరస్త్రీతో పోవువాడు ఎందుకు కొరగాని దుష్టుల సహవాసము కోరును, పవిత్రమయినట్టి, నిజమయినట్టిమాటలు పలుకు అలవాటు మానును, మిత్రుడు శత్రువగును; దేవునివాక్యబోధ వానికి రుచించక చప్పనగానుండును, క్రూరమైన చావునకైన తెగించును; అట్టివానికి దుర్గతితప్పునా । యేసునాయకా ॥

41. గాలము మ్రింగుగాక తన కాలము నేలెడు మృత్యు
నాలుకన్, కేలిడుగాక దావశిఖి కీలజొరం జనుగాక యుగ్రకా,
కోలము గ్రోలుగాక పెరకోమలి కామవికారచాటువా, చాల
తలందు జిక్కని విచారుడె ధీరుడు యేసునాయకా.

తాత్పర్యము

గాలమును మ్రింగవచ్చును, తనకు మరణమెప్పుడు రావలెనో నియమించు మృత్యుదేవత నోటిలో వేలుపెట్టవచ్చును, అడవి చిచ్చుమంటలో ప్రవేశించవచ్చును, భయంకరమైన కాలకూట విషము త్రాగవచ్చును.

[ఇట్టి పనులుచేసిన చేయవచ్చును. అట్టి పురుషుడు ధీరుడుకాడు.]

అన్యస్త్రీయొక్క మోహపుచేష్టలలోను మాటలలోను చిక్కని మనస్సుగలవాడే ధైర్యశాలి । యేసునాయకా ॥

42. మృదువులు గావుగా హృదయముల్ ఒనగూడెడు
భక్తి రత్నముల్, పదిలముగావుగా యితర భామలజేరినవారి
కాపదల్, కొదువలు లేవుగా విమల కోమల రమ్యమనః ప్రశాం
తమా, పదవులు బోవుగా నిరయ బాధలటావల యేసు
నాయకా.

### తాత్పర్యము

పరస్త్రీతో సాంగత్యము చేయువారికి హృదయములు కఠినమవునేగాని మృదువుగా నుండవు, మనసులో పోగయ్యే భక్తిరత్నములు భద్రముగా నుండవు, అట్టివారికి ఆపదలకు తక్కువయుండదు, బహు దివ్యమయిన మనశ్శాంతి యానందము మొదలైనవి క్షీణించి పోనేపోవును; చిట్టచివరకు నరక వేదనలు ప్రాప్తించును । యేసునాయకా ॥

## మనసు చంచలము

43. ఏ పనిలేకనే పరుగులెత్తుచు నొక్కొకచోట నిల్చిన,
లైవ్వపుల నిక్కి చూచుచు నిలాతలి గ్రుమ్మరు కుక్కరీతి నా,
పాపమనంబు నిల్వదొక పజ్జనికన్ భవదంఘ్రు లొద్ద సం, స్థాపన
చేసి నీ నెనరు త్రాటను గట్టవె యేసునాయకా.

### తాత్పర్యము

ఏ పనిలేకపోయినను వెర్రిపరుగులెత్తుచు ఒక్కొక్కచోట నిల్చి యీ తట్టు ఆ తట్టు వెర్రిచూపులు చూచుచు భూమిమీద తిరిగే కుక్కనుబోలి నా పాపపు మనస్సు ఒకదానిమీద నిలువలేక తిరుగుచుండును; యేసునాయకా నీ పాదములవద్ద నన్ను నిలిపి నీ ప్రేమయను పగ్గముతో కట్టిపెట్టుము స్వామీ!

44. మనసును బట్టి నిల్ప తన మానసమే బురికొల్పు నెట్ల
నం, గనలెడి వెర్రికుక్క మెడ గట్టగబోయిన నూలిప్రోగు
భం, గిని జనుగాదె వ్యర్థమయి కేవల నీ కరుణాంకుశంబుచే,
కొనక మనోమద ద్విపము గూడునె కట్టను యేసునాయకా.

## తాత్పర్యము

తన మనస్సును తానే నిల్పుకొనగలడనుట యెటువంటిదంటే, కోపముతో మండిపడు పిచ్చికుక్క మెడను నూలుపోగుతో కట్టితే నిష్ప్రయోజనమై పోవునుగదా; కాబట్టి నీ కరుణయను అంకుశముతో నా మనస్సనే మదపుటేనుగును స్వాధీనముచేసికొంటేనే దాని కట్టవచ్చును। యేసునాయకా॥

## విగ్రహారాధనాదుల వ్యర్థత

45. దురితములోన బుట్టి బహు దుర్జన సంగతి పెంపు
జెంది దు, శ్చరితపు వెజ్జువేల్పులకు సాగిలి విగ్రహభక్తి జేసి ము,
ర్ఖుడయి దుస్స్వభావపు వశంబగు పాపినరుండు పుణ్యమే,
తెరగున జేయు నీతి సుపథం జననేర్చునె యేసునాయకా.

## తాత్పర్యము

పాపములోపుట్టి, బహు దుష్టులతో సహవాసముజేసి దుష్టదేవతలను మ్రొక్కి విగ్రహారాధనచేసి మూర్ఖుడయిపోయి పాపస్వభావమునకు లోనయిన పాపాత్ముడు పుణ్యమేలాగున చేయగలడు! మంచి నీతిమార్గమున నడువగలడా?। యేసునాయకా॥

46. ఇల దెగిపడ్డ వృక్ష మొరు లెత్తకయున్న దనంత లేచు
నా, విలసిత ప్రాణవాయువులు వీడిన పీనుగయుం దనంతనే,
చలనము నొందునా, దురిత జాలములో బడి చచ్చు మూర్ఖ
జీ, వులకును నీవులేని యసువుండిన నేటికి యేసునాయకా.

## తాత్పర్యము

నేలమీద విరిగిపడియున్న చెట్టు నితరులెత్తకపోతే తనంతట తానే లేచి నిలువగలదా? ప్రసిద్ధమయిన ప్రాణవాయువులు పోయిన పీనుగ తనకు తానే కదలునా? పాప సమూహములో పడి చచ్చియున్న మూర్ఖనరులు నీవిచ్చు జీవము లేనప్పుడు ఎంత ప్రాయముండిన నేమిలాభము। యేసునాయకా॥

47. ఇలను సమస్త పాపముల కెక్కువ పాపము విగ్రహం
బుపై, దలపిడి పూజసేయుటలు దానన జేసి వివేకశూన్యమై,
వెలుగు దొలంగి యాత్మ తమ వేష్టితమై చెడిపోయి పాపము,
గ్గలమగుగాని జీవనసుఖం బెదగాంచునె యేసునాయకా.

తాత్పర్యము

లోకములో పాపములన్నిటికంటె మహాపాపము విగ్రహములమీద మనస్సు నిలిపి పూజచేయుటయే; అట్లు చేయుటచేత వివేకముపోవును, ఆత్మకుండు జ్ఞానము నశించి అంధత్వము వ్యాపించి చెడిపోవును; పాపమే వృద్ధియగునుగాని మానవుడు హృదయములో నీవిచ్చు జీవనసుఖము అనుభవించునా। యేసునాయకా ॥

48. కనవినరాని బొమ్మలకు కానుకలిచ్చుచు లెమ్ము చూ
డునా, మనవిదె యాలకించుమని మర్త్యులనేకులు వెర్రిబుద్ధి
గై, కొని కడలేని దుర్దశల కూపములో బడియున్నవారు న,
న్ననిపిన యట్లవారల మనంబులు ద్రిప్పవె యేసునాయకా.

తాత్పర్యము

చూడలేని వినలేని బొమ్మలకు కానుక లర్పించి—లేచి చూడు ఈ నా మనవి వినుము అని యెంతోమంది మనుష్యులు పిచ్చిపట్టిన మనస్సుతో చెప్పుచు అపరిమితమైన దురవస్థలో పడియున్నారు; నన్ను నీవు రక్షించినట్టు వారి మనస్సునుకూడా మార్చి రక్షించుము। యేసునాయకా ॥

49. లోకపు చైవుల న్విడిచి లోన జరించెడు నాత్మ జూతు
నన్, పోకిళులందు బోయి తన బుద్ధిపయిన్ భరముంచు మాన
వుం, డేకొలదైన జీవసుఖ మించుకలేక నశించుపాప మం, గీకర
మాత్రలేక నిను కీర్తనసేయక యేసునాయకా.

తాత్పర్యము

ఈ లోకపు చర్యలన్ని విడిచి (యోగులయి) తమలోనున్న ఆత్మను చూడగలమను భ్రమను పెట్టుకొని తన బుద్ధిబలమునే ఆధారముచేసికొను

మానవుడు ఎంతమాత్రము నిజమైన సుఖముగల బ్రతుకు ఎరుగక, తన పాప స్థితి నొప్పుకొనక, నీ నామకీర్తన చేయక నశించిపోవుచున్నాడు। యేసు నాయకా॥

50. పాపముసేయు వేలుపుల ప్రాపున జేరెడు పాపులెట్ల
నం, దూపరిచేత బోయి తమ తుండ మగాధ మనీరమైన దు,
ష్కూపముజేర్చి తత్తరను గూలి నశించెడు వారి భంగి వా,
రేపగిదిన్ విముక్తి సుఖమెన్నడు గానరు యేసునాయకా.

తాత్పర్యము

పాపకార్యములు చేసిన దేవతల నాశ్రయించిన పాపాత్ము లెట్టివారనగా దాహముగొనిన యేనుగు (నీళ్లున్నవన్న భ్రమచేత) నీరులేనిది, మిక్కిలి లోతయి వది పాడుపడియున్న బావియొద్దకు బోయి ఆత్రముతో తన తొండము పెట్ట బోయి దానిలో పడి నశించునుగదా; అదేరీతిని వారికి మోక్షసౌఖ్యము దొర కనే దొరకదు। యేసునాయకా॥

51. విమల నదీ జలంబులు సమీపమునం బ్రవహింపు
చుండ దా, హము గొనలేక వెర్రి మనుజాధముడద్దరి నుయ్యి
త్రవ్వి నీ, రము గొనబోవునట్లు మధురంబగు నీ స్తుతి మాని
మూఢ దై, వముల నుతించబోవుట లవశ్యము చావగు యేసు
నాయకా.

తాత్పర్యము

నిర్మలమయిన యుదకము నదిలో తనకు దగ్గిరగా పారుచుండగా దాని త్రాగి దాహము తీర్చుకొనుటకు బదులు, వెర్రివాడయి ఆ ప్రక్కను గుంట త్రవ్వి నీళ్లు త్రాగబోయిన బుద్ధిహీనునివలె కొందరు ఆనందకరమైన నీ స్తుతి విడిచి మూఢదేవతలను స్తుతించుచున్నారు; అట్టివారి గతి ఆత్మనాశనమే గదా?। యేసునాయకా॥

## నరకము తప్పించుకొను సాధనము

52. నిరయ నితాంత సంతమస నిర్గత ధూమ సమగ్రవహ్ని
పా, గర భరితోగ్ర వీచికలు గప్పెడి కాలముదప్ప నిప్పుడే, నర

గున బోయి మానసము సజ్జన క్రైస్తవ గోష్ఠినుండినన్, చిరసుఖ
మాత్మకబ్బు తుది జేకురు మోక్షము యేసునాయకా.

### తాత్పర్యము

నరకమునందలి యెడతెగని చీకటిలోనుండి బైలుదేరే పొగతో కూడిన అగ్ని సముద్రములోనుండు భయంకరమైన అలలు ఆత్మను కప్పివేయు సమయము రాకముందే యిప్పుడే శీఘ్రముగా వెళ్లి మనుష్యుడు తన మనస్సును, సత్క్రైస్తవుల సహవాసమున చేర్చినయెడల నిత్యమగు సుఖము ఆత్మకు లభించును, చివరకు పరలోకము ప్రాప్తించును। యేసునాయకా ॥

## సత్యమైన ప్రాయశ్చిత్తము

53. కనుగొనల న్నిరంతరము గారెడు నీరము వేరుచేసి
నా, తనువు సమస్తముం దరిగి ధైర్యత వహ్నిని వ్రేల్చునీ పరా,
మననము నాకు గల్గినను పాపమొకించుక బాయునే భవ, త్తను
మృతికర్త దివ్య సుకృతంబొనగూడక యేసునాయకా.

### తాత్పర్యము

నా కన్నులనుండి యెల్లప్పుడు పాపమునుగూర్చి విలాపముతో కన్నీరు పారుచుండినను, నా శరీరమంతా ఖండించి తెరువచేత అగ్నిలో హోమము చేసేటంత త్యాగబుద్ధి కలిగినను, నీ మరణముయొక్కయు రక్తముయొక్కయు పుణ్యము సంపాదించుకొననియెడల నా పాపము లేశమయిన పోవునా! యేసునాయకా ॥

54. పరమ పవిత్రమున్ పతిత పావనపుణ్య నిధానమైన
నీ, కర చరణారవిందముల గారెడి రక్తములో మునింగి నా,
నెరి దురితంబులం దొలగి నెమ్మది సౌఖ్యము గల్గి నీ కృపా,
శరధిని వాలలాడి తుద సద్గతి నొందెద యేసునాయకా.

### తాత్పర్యము

మిక్కిలి పవిత్రమును పాపులను పుణ్యాత్ములనుగా చేయు సాధనమైన తామరపువ్వువలె మృదువయిన నీ హస్తములనుండి పాదములనుండి స్రవించిన

రక్తమునందు నా యాత్మ మునిగి నా విస్తారపాపములను పోగొట్టుకొన్నందు
ననే నాకు మనశ్శాంతి కలుగుచున్నది, ఇకమీదట నీ కృపాసముద్రములో
ఈదులాడుచు జీవించి తుదకు మోక్షములో చేరెదను । యేసునాయకా ॥

55. ప్రేమను మానవాకృతి ధరించుట శాశ్వత రాజ్య
సౌఖ్యముల్, ప్రేమను వీడివచ్చి కడుపేద మనుష్యుని యింట
జన్మమున్, ప్రేమను దోసకారులను బిల్చుట నమ్మినవారి పాప
ముల్, ప్రేమచె మోసి నీ తనువు ప్రేమను వీడుట యేసు
నాయకా.

తాత్పర్యము

నీవు నీ ప్రేమాతిశయముచేతనే నరరూపము తాల్చితివి; ఆ ప్రేమను బట్టియే మోక్షరాజ్యమందు నీకుగల నిత్యసౌఖ్యమును మహిమను విడిచిపెట్టి కడు బీదవానియింట బుట్టితివి; ఆ ప్రేమతోనే పాపాత్ములను నీయొద్దకు రమ్మని పిల్చితివి; నిన్ను నమ్మి వచ్చినవారి పాపములను భరించి నీ శరీరము నర్పించితివి । యేసునాయకా ॥

56. ప్రేమసుధానిధీ సకల ప్రేమల సారములోని నిగ్గు
నీ, వైమహిలోన పాపినరవర్గము గావను వచ్చినావు నీ, ప్రేమ
దలంచ నా తరమె బీదగు నీదగు శిష్యులందు నీ, ప్రేమను
జూప కాళ్లగడుగవే ప్రియమొల్కగ యేసునాయకా.

తాత్పర్యము

ఓ ప్రేమామృతమునకు ఊటయయినవాడా, ప్రేమ యెన్నెన్ని విధములుగా నుండగలదో వాటన్నిటిలోను మహా శ్రేష్ఠమయిన ప్రేమాస్వరూపివై యీ లోకములోని పాపికోటిని రక్షింపవచ్చినవాడా, నీ ప్రేమ యిట్టిదని వివరించుట నా తరమా, కడుపేదలయిన నీ శిష్యులయెడల నీకుగల ప్రేమాతిశయము చూపుటకు వారి పాదములు కడిగితివిగదా । యేసునాయకా ॥

57. నీ మరణంపు మ్రానిదెస నిశ్చలదృష్టులు నిల్పువాడు
నీ, ప్రేమరసంబు గ్రోలి మది బీటలువారి వినమ్రుడై భవ,

న్నామము నెంచుచుం దనువునం బులకాంకురముల్ చెలంగ ని,
ష్కామ సుభక్తి మానస సుఖంబున వర్ధిలు యేసునాయకా.

తాత్పర్యము

నీవు మరణముపొందిన సిలువప్రానివైపు నిశ్చలముగా తన కన్నులు పెట్టి చూచి ధ్యానించువాడు నీ ప్రేమామృతము పానముచేసి హృదయము పగిలి వినయముగలవాడై నీ నామము స్మరించుచు ఆనందముచేత శరీరమున గగుర్పాటునొంది ఫలాపేక్షలేక పవిత్రమైన భక్తిచెంది మనసానందముతో వర్ధిల్లును । యేసునాయకా ॥

58. జగతియు దాని సర్వధన సంపదలన్నియు కానుకబెట్టి
యుం, పుగ మమదేహమంతయు బ్రమోదముతో బలిగాఁగ
వ్రేల్చినం, దెగునె మదీయపాప మెదదీరునె తాపము వేయు
నేల నీ, దగు తనురక్తమే పరమధర్మము నాకది యేసునాయకా.

తాత్పర్యము

ఈ లోకమును దానిలోనుండు ధనధాన్యాదులన్నియు నీకు అర్పించి నా దేహమంతా సంతోషముతో బలిగా కాల్చివేసినను, నా పాపము పోవునా! హృదయములో వేదన తీరునా? వెయ్యిమాటలేల! నీ శరీరరక్తములే నాకు పుణ్యసాధనము । యేసునాయకా ॥

ప్రభువు మరణమువలని పుణ్యము

59. పల్లవతుల్య పాదకర పంకజ మధ్యములందు రక్త
మున్, చిల్లున జిమ్మ మేకులు దుసిల్లగ సిల్వనుగొట్టి పక్కలో,
బల్లెము గ్రుచ్చు వారియెడ వైరములేక కృపారసంబు శోభిల్లె
గదా భవద్ధృదయ వీధిని పెల్లుగ యేసునాయకా.

తాత్పర్యము

లేత చిగుళ్లవంటి మృదువైన నీ కరచరణారవిందముల మధ్యనుంచి రక్తము చిమ్మున వచ్చునట్లు మేకులుకొట్టి సిలువకు బిగించి, నీ చిరుడొక్కను

బల్లెముతో పొడిచిన క్రూరులయెడల ద్వేషములేక నీ హృదయమున కృపారసమే మెండుగ ప్రవహించెగదా । యేసునాయకా ॥

60. కొట్టిరి జేరు బందులను గుచ్చిన ముండ్ల కిరీటమూ
దలం, బెట్టిరి దుష్టసైనికులు బిట్టుగ బాధల బెట్టి కల్వరీ,
మెట్టను సిల్వమ్రానిపయి బెట్టి వధించిరి భక్తులాత్మచే, పట్టను
గాదె యీ దశకు బాల్పడినాడవు యేసునాయకా.

తాత్పర్యము

దుర్మార్గులగు రాణువవారు పెద్దమేకులతో [నీ కాలుసేతులను] బిగించిరి; నీ తలకు గుచ్చుకొనే ముండ్లకంపతో చేసిన కిరీటము పెట్టిరి; కఠినమైన బాధలు పెట్టి కల్వరి గుట్టను సిలువమీద నిన్ను వధించిరి; ఇది యెందుకు! నీ భక్తుల ఆత్మలను రక్షించుటకేగదా యీ శ్రమలన్నిటికి నీవు లోబడితివి । యేసునాయకా ॥

61. పొంతిపిలాతు మ్రోల గొనిపోయెడి దుర్జనయూద
సైనికుల్, మించి మహోగ్ర బాధలను మృత్యువొనర్పగ
బోవు నత్తరిన్, ముంచిన గాలివానలకు మూర్ధము వంచని
కొండరీతినీ, యంచితమైన ధైర్యమహిమాద్భుత మొప్పెను
యేసునాయకా.

తాత్పర్యము

దుష్టులయిన సైనికులు పొంతిపిలాతునొద్దకి నిన్ను తీసికొనిపోయి బహు క్రూరమయిన శ్రమలు నీకు కలుగజేసి నిన్ను చంపబోవునప్పుడు కొండనె ముంచునంత వానకు తుఫాను గాలికి తలవంచని పర్వతమువలె నీవు మహాతిశయమగు ధైర్యమును చూపుచు సహించితివిగదా! । యేసునాయకా ॥

62. పులుగులకుండె గూళ్లు మరి బొల్పుగ నక్కల
కుండె గోతులీ, యిల తల చాఁవ నాకు తల పెక్కడ లేదని
దీన వృత్తితో, బలికెడి నీ మృదూక్తులకు భక్తుల డెందము

గంది కుంది క, న్గొలుకుల నశ్రుబిందువులు గొబ్బున రాలవె
యేసునాయకా.

### తాత్పర్యము

పక్షులకు గూళ్లును, నక్కలకు కన్నము లున్నవిగాని యీ లోకములో తల వాల్చుటకు నాకు స్వంత స్థలములేదని నీవు పలికిన దీనవాక్యమునకు నీ భక్తజనులు మనస్సు కరిగి నొచ్చుకొని వారి కన్నులనుండి నీరు ధారలుగా కారవా। యేసునాయకా॥

63. కరములు పార జాపి యిరు కాళ్లొకచో నిడి సిల్వ
మ్రానిపై, తిరముగఁ బండ బెట్టి బలు దిట్టపు మేకుల గొట్టు
వేళ నె, త్తురు లొగిబారు గాయములతో శ్రమతో కడుసల్పు
తోడ నీ, వరుదగు బాధ నొందవె తవాశ్రిత రక్షక యేసు
నాయకా.

### తాత్పర్యము

[ఆ నాడు క్రూరులు] నీ చేతులు పారజాపి రెండు పాదములు జోడించి సిలువకొయ్యమీద నిన్నుపరుండబెట్టి బలమైన గసికలతో వాటిని బిగియ గొట్టినప్పుడు ఆ గాయములనుండి రక్తధారలు పారగా నీ వెంతో నొప్పితోను, మనోవేదనతోను, నీ శరణుజొచ్చిన వారి రక్షణార్థమై చెప్ప నలవిగాని బాధ ననుభవించితివిగదా। యేసునాయకా॥

64. పుడమి వణంకె సంతమసమున్ రవి గప్పె సమా
ధులద్రులు, నక్కడువడి బ్రద్దలై తెరిచె కల్వరిమెట్టను నీవు
సిల్వపై, నిడుమల నొంది ప్రాణములు వీడిన కాలమునందు
నక్కటా, పొడియవదేల నా మనసు మోటతనం బిది యేసు
నాయకా.

### తాత్పర్యము

నీవు సిలువమీద శ్రమల ననుభవించి ప్రాణములు విడిచినప్పుడు భూమి కంపించెను, సూర్యబింబము చీకటిమయమాయెను; కల్వరి కొండమీది సమా

ధులును బండలును ఒకపెట్టున పగిలెను గాని నా రాతివంటి గుండె కరుగదే, యెంత మూర్ఖమయినది నా మనస్సు । యేసునాయకా ॥

65. మరణము రెండు రీతులయి మానవులందరి బట్టి
చంపెనే, మరణము నాత్మమృత్యువు గ్రమంబున పాపమువల్ల
నాత్మపై, మరణము నేలె దాని బరిమార్చుటకై మృతిబొంది
తీవు నీ, మరణము పాప దుర్మరణ మారణ హేతువు యేసు
నాయకా.

## తాత్పర్యము

మనుష్యుని పాపమువల్ల శరీరమునకు మరణము, ఆత్మకు మరణము అను రెండు విధముల మరణము మానవుల కందరికి ప్రాప్తించెను; ఆత్మకు వచ్చిన మరణమును నశింపజేయుటకయి నీవు మరణము నొందితివి; ఇట్టి నీ మరణము పాపమువల్ల వచ్చిన శరీరాత్మల మరణమునకు మరణము కలుగజేయు సాధనమయినది గదా । యేసునాయకా ॥

66. ఒక్కని పుట్టుకన్ భువిని జెందెను పాపము దాని
మాన్ప నిం, కొక్కని చావునన్ పుడమి జొచ్చెను పుణ్యము
పాపమాదముం, ద్రొక్కెను నీతి పుణ్యముల త్రోవలు నీ
మరణంబుచేత పెం, పెక్కెను దీని నమ్ము నరులెంతటి ధన్యులు
యేసునాయకా.

## తాత్పర్యము

ఒకడు పుట్టుటనుబట్టి భూలోకములోకి పాపమువచ్చెను, దానిని పోగొట్టి పుణ్యము సంపాదించుటకు మరియొకరి మరణము సాధనమాయెను; అతని పాపము ఆదాము నణగద్రొక్కగా నీవు మరణము పొందినందువల్ల నీతిపుణ్యములు మానవులకు దొరుకు మార్గ మేర్పడెను; ఈ సత్యములు నమ్ము మానవులెంతో ధన్యులు । యేసునాయకా ॥

## ప్రభువుయొక్క ఉచితమగు కృప

67. ఉచిత దయా ప్రభావ మహిమోన్నత శక్తిని నీవు
నెందరిన్, ప్రచురముగా ననంత సుఖ భోగుల జేసితి వెంత

వింత దు,ష్ట చరితు డొక్క తస్కరుడు చచ్చెడు కాలము నందు నిన్ను వే,డుచు జనె గాదె ముక్తికి గడున్ ముద మొందుచు యేసునాయకా.

తాత్పర్యము

నిర్హేతుకమయిన కటాక్షమును చూపి నీ వెందరినో బాహాటముగా అపరిమితమయిన సుఖము ననుభవించునట్లు చేసితివి, ఇది యెంతో ఆశ్చర్యము కాదా? దురాత్ముడయిన యొక దొంగ మృతినొందే సమయమున నిన్ను ప్రార్థించి మహా ఆనందముతో మోక్షమునకు బోయెనుగదా । యేసునాయకా॥

68. పడతి యొకర్తు వచ్చి తన బాష్ప జలంబుల నీ పదాబ్జము,ల్గడిగి శిరంబు వంచి కురులన్ దగనొత్తి సుగంధ తైలమా,యడుగులఁ బూసి ముద్దులిడె నట్టి మహా దురి తాత్మురాలిపై, కడుదయ జూపి మోక్షపథ గామిని జేయవె యేసునాయకా.

తాత్పర్యము

ఒక స్త్రీ నీయొద్దకి వచ్చి కన్నీటితో తామరపూవులవంటి నీ పాదములు కడిగి తన తల వెండ్రుకలతో నీ పాదము లద్ది తుడిచి వాటికి సుగంధ తైలము పూసి ముద్దుపెట్టుకొనెను; ఆ పాపాత్మురాలిమీద ఎంతో దయచూపి మోక్ష మార్గమున ప్రవేశపెట్టితివి । యేసునాయకా ॥

69. తాలిమిలేని క్రోధపరితాప మనస్కుడునై త్వదీయ భ,క్తాళిని పాడుసేయ నరికట్టి దమస్కను ప్రోలి కేగునా, సౌలను వాని నీ పరమ భక్తుని జేసితి విట్టి నీ కృపా, శీల మహాత్వమబ్బురమ చింత్యమనంతము యేసునాయకా.

తాత్పర్యము

ఎంతసు ఆగనిద్వేషముతో మండుచున్నబుద్ధితో నీ భక్తసమూహమును నశింపజేయవలెనన్న నిశ్చయముతో దమస్కు పట్టణమునకు బోవుచున్న సౌలను నతని నీ పరమభక్తునిగా చేసితివే; ఇట్టి నీ కృపాస్వభావమెంత అద్భుతమైనది! మానవుని బుద్ధికందనిది, యింతంతయని వర్ణింపసాధ్యముకానిది । యేసునాయకా ॥

70. ముమ్మరమైన ప్రేమరస ముప్పతిలన్ కనులందు
నశ్రుపా, తమ్మొనరించి యేడ్చియు స్వతంత్ర దయాబలమూని
లాజరా, లెమ్మని బల్కునంతటనె లేచియు వాడు సమాధి మృత్యు
బం, ధమ్ములబాసె నీ కతడు డాసినచుట్టమె యేసునాయకా.

### తాత్పర్యము

విస్తారమయిన ప్రేమ పుట్టుకొనిరాగా కన్నీరు రాల్చుచు విలపించి నీ స్వంత దయాతిశయమును చూపి, లాజరా లెమ్మని పిలువగానే అతడు లేచి సమాధియొక్క మరణముయొక్క కట్లను తెంపుకొనెను; అతడు నీకు దగ్గిర చుట్టమా । యేసునాయకా ॥

71. ఎన్నటిచుట్టమో మరియ యెన్నటిబంధువో లాజ
రుండు నీ, కెన్నటి కూర్మివిందో మృతివేళ దలంచిన తస్కరుండు
వీ, రెన్నిక జెందినారు మరియెందరి నీ కృపచేత మోక్షసం,
పన్నులజేసినావు భవబంధములూడిచి యేసునాయకా.

### తాత్పర్యము

ఆ మరియ నీ కేనాటిబంధువో, ఆ లాజరు నీ కెన్నటిచుట్టమో, మరణ సమయమున నిన్ను తలచిన ఆ దొంగ నీకు ప్రియబంధువో, వీరు ప్రసిద్ధిలోకి వచ్చినవారు; ఇంకా యెందరెందరిని పాపబంధములు తెంపివేసి నీ కృపచేత మోక్షభాగ్యము గలవారినిగా చేసియున్నావు । యేసునాయకా ॥

## ప్రార్థన స్తోత్రములు

72. కంటికి రెప్పలడ్డముయి గాచినరీతిని యేసునాథ నా,
వెంట భవత్కటాక్షమగు వీక్షణపంక్తుల నంటజేసి యా, కొంటె
పిశాచి బాధ విడగొట్టి సదా నను గాచికొంచు మ, త్కంటక
దుస్స్వభావ దురితంబులణంచవె యేసునాయకా.

### తాత్పర్యము

కనుగుడ్డును రెప్పలు సంరక్షించినట్లు, ఓ యేసునాథా, నీ కృపగల చూపులు నామీదనిలిపి నన్ను వెంబడింపజేసి ద్రోహియయిన ఆ సాతాను

బాధను తప్పించి నన్నెల్లప్పుడు రక్షించుము; నా దుష్టస్వభావమువల్ల పుట్టే పాపాములను తలయెత్తనీయక నశింపజేయుమయ్యా। యేసునాయకా॥

73. ఆఁకలి దీరు బెబ్బులి గుహన్గడు నిద్దురబోయినట్లు
పెం, జీఁకటితోటి సాటిగొను చెడ్డస్వభావము క్షీణభావమై,
కాఁకలుమాని నిద్రగొనె గావున నింకది లేచి నా పయిం, బ్రాఁ
కకమున్నె దాని బరిమార్చవె వేఁడెద యేసునాయకా.

## తాత్పర్యము

ఆకలితీరిన పెద్దపులి దాని గుహలోపరుండి నిద్రపోవుచున్నట్టున్న నా పాపస్వభావము గాఢాంధకారమును బోలినదైయున్నను, ఇప్పుడు దాని వడి తగ్గి నిద్రపోవుచున్నట్టు ఉన్నది; అది తిరిగిలేచి నామీదపడి నన్ను లోపరచుకొనకముందే దాని సంహరించుమని వేడుకొనుచున్నాను। యేసునాయకా॥

74. అడిగినవారి కియ్యబడు నన్న భవద్వచనంబు నమ్మి నీ,
యడుగులక్రింద మూర్ధ్న మిడి యశ్రుయుతాక్షులు మోడ్చి
భక్తియిం, పడరగ నీకు మ్రొక్కెద కృపాయతదృష్టిని నన్ను జూచి
నా, యిడుమలు బాపి యాత్మ సుఖమియ్యవె యిప్పుడు యేసు
నాయకా.

## తాత్పర్యము

అడిగినవారి కియ్యబడునన్న నీ మాట నమ్మి నీ పాదములక్రింద నా తల నుంచి కన్నీళ్లతోనిండిన కన్నులు మూసికొని భక్తితో నీకు మ్రొక్కెదను; దయతోనిండిన చూపులతో నన్ను చూచి నా శ్రమలు పోగొట్టి ఆత్మానందము దయచేయుమయ్యా। యేసునాయకా॥

75. అందము మిఱు నీ పదము లాత్మదలంచి శిరంబువంచి
చె, ల్వొందగ వందనంబిడి యి దొక్కటి వేఁడెదనయ్య నేను నీ,
సుందర దివ్యనామ పరిశుద్ధ కథామృత పానమాన సా, నందము
సర్వదాయొసగి నన్గరుణింపవె యేసునాయకా.

### తాత్పర్యము

నీ దివ్యమయిన పాదములను మనస్సులో తలచుకొని, తలవంచి తగినట్టుగా నమస్కారముచేసి మొక్కు మనవిమాత్రము చేసికొనుచున్నాను; నన్ను కరుణించి దివ్యమగు నీ నామమునుగూర్చిన పరిశుద్ధ కథయనే అమృతపానము చేయుటచేత కలుగు ఆనందము నెల్లప్పుడు అనుభవించునట్లు దయచేయుము। యేసునాయకా ॥

76. నీ కరుణాకటాక్షమను నీడల జాడల జేర్చకున్న హా,
హాకరమైన దుఃఖముల కాస్పదమయ్యెదనయ్య నాకు నీ, వే కద
దిక్కు ఇంకెవరివెన్కను బోతిని చెప్పుమయ్య న, న్నైకొని
బ్రోవుమయ్య నినునమ్మితి బుద్ధిని యేసునాయకా.

### తాత్పర్యము

నీ దయాదాక్షిణ్య అనుభవము నాకు దయచేయనియెడల హాహాయని విలపించు విలాపములు నా పాలగును; నా కాశ్రయమునీవే, మరి యెవరి చాటును చేరితినో చెప్పుమయ్య; నన్ను చేపట్టి రక్షించుము, నిన్నే నమ్మియున్నాను। యేసునాయకా ॥

77. పేదురపొస్తలుండు రిపు బృందము ముందట మూడు
మార్లు ని, న్నేదముచేసి బొంకెమది భీతిని నంతట వానితట్టు ప్రే
మోదయమైన చూపొకటి యోరగ జూచితి వట్టిచూపు నా,
మీదను జూడవే యనుచు వేడెద నిప్పుడు యేసునాయకా.

### తాత్పర్యము

నీ శిష్యుడగు పేతురు శత్రుసమూహమునకు భయపడి వారియెదుట నిన్నెరుగనని బొంకెను; అప్పు డతనివైపు ప్రేమతో నిండిన చూపొకటి చూచితివి, అట్టి చూపు నామీదను చూపుమని వేడుకొనుచున్నాను। యేసునాయకా॥

78. నను గన రాగదే దినదినంబు భవత్సముఖంబునందు
నా, కనుగవ నీరధారలివె గారుచునున్నవి నీ పదాబ్జముల్,

మునుగగజేసి స్తోత్రమను పువ్వులపూజలు చేతు నాపయి,
న్కనికరముంచవే యితరకాంక్షలు మానిపి యేసునాయకా.

తాత్పర్యము

ప్రతిదినము నన్ను చూడరమ్ము, యేసునాథా; నీ సన్నిధిని నా రెండు కండ్లనుండి నీరు ధారలుకట్టి కారుచున్నవి; వీటితో నీ పాదపద్మములను కడిగి స్తుతులను పువ్వులతో వాటిని పూజింతును; నామీద దయయుంచి యితర ఆశలు నాలోనుంచి తీసివేయుము। యేసునాయకా॥

ఉ. వే. 79. ముచ్చటలూర నీ చరితమున్ వినగోరెడు వీనులాత్మ
లో, నచ్చున వేసినట్లు భవదంఘ్రులు జూచెడు కన్నుదోయి ని,
ప్పచ్చర దోసముల్ చిదుము పావననామము బల్కు జిహ్వనా,
కిచ్చి కృతార్థుజేసి దయనేలవె యెప్పుడు యేసునాయకా.

తాత్పర్యము

ఆశతీర నీ చరిత్ర వినగోరెడు చెవులును, నా హృదయమునందు అచ్చు వేసియున్నట్టు నీ పాదపద్మములను చూడగల కన్నులును, ఎంతెంత ఘోరపాపములను హరించు నీ పరిశుద్ధ నామము నుచ్చరించు నాలుకయును, నా కనుగ్రహించి నన్ను కృతార్థునిచేయుము, దయతో నన్ను పాలించుము। యేసునాయకా॥

చ. వే. 80. నిరతము నీ పదాబ్జములు నిశ్చలభక్తిని గొల్చు
సాధులం, దరుచుగ జేరనిచ్చి తవ దాసజనావళితోటి పొందు
ను, స్థిరముగజేసి నాకు పరితృప్తియుతంబగు నెమ్మి నీ పయిన్,
మరువనిబుద్ధి యీ పరమభాగ్యము లియ్యవె యేసునాయకా.

తాత్పర్యము

ఎల్లప్పుడు నీ పాదపద్మములు స్థిరమయిన భక్తిప్రేమతో సేవించు భక్తులతోకూడి, వారితో సహవాసముచేయు భాగ్యమును, సంతుష్టితో నిండిన మనోనెమ్మదియు, నిన్నెన్నడు మరువని మనస్సును నా కనుగ్రహించుమా। యేసునాయకా॥

81. నన్ను గురించి బ్రోచుటకు న్యాయ మొకింతయు లేదు
గాని నా, విన్నప మాలకించుమిదె వేదురునై చెడిపోయినా
డరా, వన్న సహింపవన్న బ్రతిమాలెదనన్న విలంబమేటికో,
యన్న భవత్కటాక్షమణు వంత యొసంగుము యేసునాయకా.

తాత్పర్యము

నన్ను రక్షించవలసిన విధి నీ కెంతమాత్రము లేదుగాని నా మనవి వినుము; నేను వెర్రివాడనై చెడిపోతిని; నన్ను రక్షించుటకు రమ్ము, ఇక నేను తాళలేను, నిన్ను వేడుకొనెదను, ఆలస్యమేల చేసెదవు? ఏ మాత్రమైన సరే నీ కృప చూపుము । యేసునాయకా ॥

82. నేరము లెంచకయ్య యిక నీ పదమే గతియంచు
జేరితిన్, దూరము జూడకయ్య కడు దుఃఖపయోనిధి నీదు
చున్ననన్, పారము జేయుమయ్య యఘ భారమునంతయు
బాపి నన్ను నీ, వారల గూర్చుమయ్య దృఢ భక్తియుతంబుగ
యేసునాయకా.

తాత్పర్యము

నా అపరాధములు లెక్కింపకుము; నీ పాదమె నాకు గతి యని నేను వచ్చియున్నాను, నన్ను దూరముగా నుంచకుము, అపారమయిన దుఃఖసముద్రములో పడి యీదుచున్న నన్ను ఒడ్డెక్కించుము; నా పాపభారమంతా తీసివేసి నీయందు స్థిరమయిన భక్తియుంచి నన్ను నీ జనుల లెక్కలో చేర్చుకొనుము । యేసునాయకా ॥

83. జీవులకెల్ల రాజవయి జీవుల జీవనమిచ్చు దాతవై,
జీవుల పాపముల్ దొలగ జేయను జీవమొసంగు త్రాతవై,
జీవుల మధ్యవర్తివయి సిల్వను మృత్యువు నొందియున్ పున,
ర్జీవము దాల్చి మోక్షనగరిన్ చిరజీవివి యేసునాయకా.

తాత్పర్యము

ప్రాణికోటి కంతటికి రాజవు నీవు, జీవుల కన్నిటికి ఆహారమునిచ్చు దాతవు నీవు, నరుల పాపములను పోగొట్టుటకై నీ ప్రాణమిచ్చిన రక్షకుడవు

నీవు, సమస్త మానవులకు మధ్యవర్తివి నీవు, సిల్వమీద మరణముపొంది తిరిగి సజీవుడవయి మోక్షనగరియందు నిరంతరము జీవించుచున్నావు । యేసు నాయకా ॥

84. ఎచ్చట పాతకంబు కడు హెచ్చెనో భూరి భవద్దయారసం, బచ్చట నెక్కువయ్యెనని యర్మిలి బల్కెడి దివ్యవాక్యమున్, మచ్చుగనయ్యె నా యెడల మత్కలుషంబులనేకమైననీ, విచ్చట జూపినావు దయ లెక్కువ నాయెడ యేసు నాయకా.

తాత్పర్యము

పాప మెక్కడ విస్తరించెనో విస్తారమగు నీ కృప మరి విస్తరించెనని చెప్పు నీ దివ్యమయిన మాట నా యెడల దృష్టాంతమయినది; ఎట్లనగా నా పాపములు విస్తారమైయున్నను, నా మీద నీవు చూపిన కృప అంతకంటె అధికముగా నున్నది । యేసునాయకా ॥

85. ఎవ్వడుగాని నా సరస కింపుగ వచ్చినవాని నెవ్విధిం, దవ్వున బారదోలనని తాల్మిని బల్కెడు నీదు వాక్యముం, బువ్వవలెన్ మదంతర బుభుక్షయు తాత్మకు తృప్తి జేసి నా, కొవ్విన పాపముల్ దునిమి గూర్చె సుఖోన్నతి యేసునాయకా.

తాత్పర్యము

ఎవ్వడైన సరే నా యొద్దికి తిన్నగా వచ్చినయెడల వాని నెంతమాత్రమును త్రోసివేయనని శాంతముతో నీవు పలికిన మాట నాలోని ఆకలిగొనియున్న ఆత్మ కాహారముగానుండి నన్ను తృప్తిపరచి బలిసియున్న నా పాపములను నశింపజేసి సౌఖ్యస్థితి నాకు కలుగజేసెను । యేసునాయకా ॥

86. అంధులు జూడగల్గిరి మహా బధిరుల్విని రుగ్రభూతసం, బంధులు బంధముల్వదలి బాగయి రెల్లెడ సర్వరోగని, ర్బంధులు స్వస్థులైరి మృతి బొల్పడువారు సజీవులైరి పా, పేంధనవహ్ని నీ వచన మెంత మహత్వము యేసునాయకా.

## తాత్పర్యము

గ్రుడ్డివారు చూపునొందిరి, ఎంతెంత చెవిటివారు వినగల్గిరి; ఘోర పిశాచములచే పీడింపబడినవారు విడుదలయైరి; అన్నివిధములైన రోగములు గలవారు బాగయిరి, చనిపోయినవారు సజీవులైరి; పాపమను కట్టెలకు నీ వాక్యము అగ్నివంటిది, దాని మాహాత్మ్యము నేమని వర్ణింతును । యేసు నాయకా ॥

## సత్క్రియలవలన నే మోక్షము గలుగదు

87. దురితము బాసి యానరక దుఃఖము దీరునటంచు
కొందరీ, ధరణి ననేక సత్క్రియలు దారొనరింతురు నీ కటాక్ష
ముం, దొరలని సర్వ ధర్మములు దుఃఖకరంబులు గాని సత్సుఖా,
కరములు గావు సత్క్రియల గల్గునె మోక్షము యేసునాయకా.

## తాత్పర్యము

పాపము పోయి నరక శ్రమలు తప్పునని కొందరు భూలోకములో చాలా పుణ్యకార్యములు చేతురు; కాని నీ కృప పొందకుండా మనుష్యులు చేయు కార్యములు దుఃఖకారణములేగాని నిజమయిన సుఖము నిచ్చునవి కావు; పుణ్యకార్యములు చేయుటచేత మోక్షము దొరకదు । యేసునాయకా ॥

88. నిరుపమ నిత్య సత్య ఘన నిర్మలతేజ విరాజమాన
మై, బరగెడు మోక్షపట్టణ శుభస్థిరసౌఖ్యము గల్గు నిన్ననే,
మరక భజించువారి కది మాని సుకర్మము లెన్నియున్న నీ,
కరుణయులేక సత్క్రియల గల్గునె సద్గతి యేసునాయకా.

## తాత్పర్యము

సమాన రహితమైనది, నిత్యమైనది, సత్యమైనది, నిర్మలమయినదినగు ప్రకాశతచేత వెలుగొందు మోక్షపురిలోనుండు మంగళ ప్రదమును నిరంతరము నైన క్షేమస్థితియందున్న నిన్ను సదా సేవించువారము, ఆ సేవ విడిచిపెట్టి యెన్ని పుణ్యకార్యములు చేసిననేమి, నీ కృప లేనప్పు డెన్ని సత్క్రియ లున్నను సద్గతి కలుగదు । యేసునాయకా ॥

## అన్యదేవతలయెడల భక్తుని విరక్తి

89. వలుకులు వేయునేల తవ పాదసరోజ మరంద
పానమ, ద్విలసిత మానసాళి యవివేక నరావళి గొల్చు వెజ్జు
వే, ల్పుల కడ కేఁగదయ్య ఘన పుష్పకణంబులు గ్రోలు చాత
కం, బెలమిని చౌట గోతికడ కేఁగని రీతిని యేసునాయకా.

### తాత్పర్యము

వేయి మాటలతో ఏమి ప్రయోజనము! నీ పాద పద్మములలోని తేనెను పానముచేసిన నా మనస్సు నే తేనెతీగ జ్ఞానములేని మానవులు సేవించు వ్యర్థమైన దేవతలయొద్దకు బోనేరదు స్వామీ; ఎట్లనగా చంద్రుని కిరణములు పానముచేయు చకోరపక్షి చౌటిగుంటలోకి పోనేరదుగదా! । యేసునాయకా ॥

90. కులము దొలంగుగాక బలు గొప్పతనంబులు
గూలుగాక క, ల్ములు వెసబోవుగాక మరి భోరున మృత్యువు
వచ్చుగాక నీ, విలసిత నిత్యశోభన పవిత్ర సుధారస నామ
సద్రుచుల్, దలపున గొన్నవారితర దైవము గొల్తురె యేసు
నాయకా.

### తాత్పర్యము

కులము పోవచ్చును, ఎంత గొప్ప స్థితియైన పోవచ్చును; ధనము శీఘ్రములో హరించిపోవచ్చును, క్షణమాత్రములో దుర్మరణము సంభవించవచ్చును గాని నీ ప్రసిద్ధమైన నామముయొక్క దివ్యమయిన రుచి యనుభవించినవారు నిన్ను విడిచి యితర దేవతలను సేవింతురా । యేసునాయకా ॥

## భక్తుని మహా సుఖము

91. ఈ సచరాచరాది జగ మేలగ జాలు ప్రభుత్వ
మబ్బినన్, రాసుల సంఖ్యలై కనక రత్నములుండిన నీ పదాం
బుజా, ధ్యాన విశుద్ధభక్తి పరమార్థ సుధారస పాన మానసో,
ల్లాసముతోడ నీడవునె లక్ష్యము సేయగ యేసునాయకా.

### తాత్పర్యము

ఈ సృష్టిలోనున్న ప్రాణులన్నిటిని ఏలునంత అధికారము లభించినను, బంగారము రత్నములు లెక్కింపలేని గుట్టలుగా సంపాదించినను, నీ పాదపద్మమందు శుద్ధ భక్తి అభ్యసించుటవల్లను, పరమార్థమనే అమృతమును పానముచేయుటవల్లను కలుగు మనసానందముతో సమానమైన ధన్యత కలుగునా? । యేసునాయకా ॥

92. శమదమ సంపదల్ గలుగు చంచల భావ మణంగు
చిత్తమున్, సమత వహించు మోక్ష సువిచారము సారము
గాంచు ప్రేమశాం, తము దయ తాల్మి నమ్రతయు ధైర్యము
వర్ధిలు నీ పదాబ్జదా, స్యము సమకూడెనేని నరజన్మఫలంబిదె
యేసునాయకా.

### తాత్పర్యము

నీ పాదపద్మమును సేవించు భాగ్యము లభించినయెడల మానవునికి శమదమాది ఐశ్వర్యములు లభించును, మనస్సుకు చాంచల్యము నశించును, బుద్ధికి సుఖదుఃఖాదులయందు సమభావము అబ్బును, మోక్ష విషయమైన మంచి ఆలోచన ననుభవించును, ప్రేమ, శాంతము, దయ, సహనము, వినయము, ధైర్యము వృద్ధియగును; ఇదేగదా మానవజన్మ మెత్తినందుకు ఫలము! । యేసునాయకా ॥

93. పాపము చెడ్డదో యనుచు బల్కుదు రింతియ
కాని దాని సం, తాపము హాని దుర్గతి విధంబు లెదం దల
పోసి వీడగా, నోపరు సత్యక్రైస్తవ జనోత్తము డాత్మ వివేక
దీపికా, వ్యాపకుడై యఘాళి గని వాటి దొలంగును యేసు
నాయకా.

### తాత్పర్యము

పాపము చెడ్డదియని కొందరందురేగాని దానివల్ల కలుగు దుఃఖము, హాని, చివరకు వచ్చు దుర్గతినిగురించి మనస్సులో ఆలోచించి పాపము

చేయుట మానరు; నిజమైన క్రైస్తవుడైతే జ్ఞానదీపము హృదయములో వెలుగుటచేత తన పాపసమూహమును చూచి వాటిని విడిచిపెట్టును । యేసునాయకా ॥

వ॥ 94. కుజనులజేయు సజ్జనుల కూళుల జేయును కోమలంబుగా, వృజినుల జేయు పుణ్యులుగ క్రుద్ధులజేయును శుద్ధసాధుగా, నిజమిది నీసుధా మధుర నిర్మలనామ మహత్వ మిట్టి నీ, భజన మొనర్చి నాకలుష బంధము లూడ్తును యేసునాయకా.

### తాత్పర్యము

నీ నామభజన దుష్టులను మంచివారినిగాను, మోటువాండ్లను మృదువైనవారినిగాను, పాపులను పుణ్యులుగాను, కోపదారులను బహుసాధువులుగాను చేయునన్నమాట సత్యమే, అమృతమువలె మధురమైన నీ పవిత్ర నామమింత మహిమగలది; కాబట్టి నీ నామమును భజించి నా పాపబంధములను తెగగొట్టుకొందును । యేసునాయకా ॥

వ॥ 95. శంక యొకింతలేని మతి సజ్జన క్రైస్తవగోష్ఠి నిత్యమున్, బొంకులులేని వాక్సరణి పొందగు నీ పద భక్తి చింతయే, కింకరులందు వర్ధిలునొ కేవలభాగ్యము వారిదే కదా యంకిలిలేని యాత్మ పరమార్థ సుఖంబది యేసునాయకా.

### తాత్పర్యము

అనుమాన మేమాత్రము లేని మనస్సు, తీయకుండా సత్క్రైస్తవులతో సహవాసము, అసత్యమెన్నడు ఆడని వాక్కు దివ్యమయిన నీ పాద భక్తిమీదనె ధ్యానము, నీ దాసులలో ఎవరియందు అభివృద్ధి పొందుచుండునో వారే కదా నిజమైన ధన్యులు, నిస్సందేహముగా ఆత్మీయ పరమార్థమంటే యిదే। యేసునాయకా ॥

వ॥ 96. సకల పురాణ శాస్త్రముల సారవిచారము సేయు పండితుల్, ప్రకటిత కావ్య నాటక సుభాషిత నైపుణులైన

సత్కవుల్, వికట శరీర తత్వ పరివేత్తలు నీదగు శిష్యకోటిలో
నొకనికి సాటివత్తురె మనోన్నత భక్తిని యేసునాయకా.

### తాత్పర్యము

సకలమైన పురాణములయొక్క శాస్త్రములయొక్క సారమును గ్రహించిన పండితులును, ప్రసిద్ధమగు కార్యములు నాటకములు చక్కగా చెప్పుట యందు నేర్పరులైన కవీశ్వరులును, విచిత్రమయిన శరీర జ్ఞానమునందు ప్రసిద్ధి చెందినవారును, మానసికమయిన భక్తి విషయములో నీ శిష్యులలో నొకనితో సాటియగుదురా? కారు । యేసునాయకా ॥

చ.మా 97. సిలువ దెసన్వసించు తమ శిష్యుని నెమ్మదితోటి
సాటియే, కుల బల శాలియై నిఖిల కుంభిని నేలిన రాజుకైన
సొం, పుల కళలీను సంపదల బొల్చు ధనాఢ్యుకైన కోటి వం,
తుల తుదివంతు గల్గునె మనో సుఖమెన్నడు యేసునాయకా.

### తాత్పర్యము

గొప్ప వంశమునందు పుట్టి యెంత బలముగలవాడయి యావత్తు లోకము నేలిన రాజయినను, మహా వైభవముతోను సంపత్తుతోను తుల తూగువాడయినను, సిలువవైపు చూచుచు జీవించు నీ శిష్యులలో నొక డనుభవించు మనోనెమ్మదితో సమానమయిన నెమ్మది యతని కుండగలదా? అసలుదానిలో కోటియవ పాలయిన నుండగలదా? । యేసునాయకా ॥

చ.మా 98. కలిగెగదా మదాత్మకృత కల్మష ధౌత పవిత్ర
రక్తమున్, గలిగెగదా భవత్కరుణ కారణ జీవనమంతరాత్మ
లో, గలిగెగదాత్వదంఘ్రియుగ కౌశల భక్తికి శక్తి యుక్తులున్,
గలిగెగదా సదా మది సుఖంబఖిలంబును యేసునాయకా.

### తాత్పర్యము

నా యాత్మ చేసిన పాపమును కడిగివేయ పవిత్రరక్తము నాకు దొరికినది, నాలోని యాత్మకు నీ కృపవల్ల కలిగే జీవనము లభించినది, నీ పాద ద్వయమునందు నిజమైన భక్తియుంచు శక్తియును మనస్సున నాకు ప్రాప్తించి

నది; నా హృదయమునకు సకల విధములయిన ఆనందము కలిగినది । యేసునాయకా ॥

99. అరమరలేని నా మన మహర్నిశలున్ భవదంఘ్రులొద్దికిన్, బిరబిర బోవగా దొణగె పేరిమి తాల్మివహించి భక్తిపై, బొరిబొరి వేడుకల్ నిగుడె బుద్ధికి నిల్కడలబ్బె నమ్మికల్ మరిమరి గల్గె నాత్మకు శుభంబొనగూడెను యేసునాయకా.

తాత్పర్యము

ఏ యభ్యంతరములేక నా మనస్సు రేయింబగలు నీ పాదములచెంత వేగముగా బోవ నేర్చుకొనియున్నది, ప్రేమ శాంతము సంపాదించుకొని నీ యందు భక్తికలిగి యుండవలెనన్న ఆశ మెండయినది, మనోచాంచల్యము పోయి స్థిరబుద్ధి దొరికినది, విశ్వాసము వృద్ధియగుచున్నది; నా యాత్మ ధన్యమైన స్థితిలో ప్రవేశించియున్నది । యేసునాయకా ॥

ప్రభునామ విజయము

100. అవనియు నాకసంబును మహాజలరాశియు పర్వతంబులున్, రవియును చంద్రతార నికరంబులు సర్వము నాశమైన నీ, ప్రవిమల నామమెప్పుడు దిరంబుగ నిల్చును దివ్యమోక్షువై, భవ సుఖ రాజ్యమేలుచు శుభంబుల దేలుచు యేసునాయకా.

తాత్పర్యము

భూమియును ఆకాశమును మహాసముద్రమును పర్వతములును సూర్య చంద్ర నక్షత్ర సమూహములును సమస్తము శూన్యమైపోయినను నీ నామము సదాకాలము స్థిరముగా నిలుచును; నీవు దివ్యమయిన పరలోకమహిమను సుఖమును రాజ్యమును నిరంతరమేలుచు సకల శుభముల ననుభవించుచు నుందువు । యేసునాయకా ॥

క॥ తనకలుష మెరిగి యేసుని
ఘనపదముల శరణుజొచ్చి కడుప్రీతిని యే

మనుజుం డీ శతకము జది
వినవాని కొసంగు దేవు డిహపరసుఖముల్.

తాత్పర్యము

తన పాపమును గ్రహించి యేసురక్షకుని పాదములను శరణము చేసి
కొని విస్తారమైన ప్రేమతో ఈ శతకమును ఎవడు చదువునో అతనికి ఇహపర
సుఖములం దేవుడు దయచేయును.

ఆ॥ పదియు నెనిమిది నూర్లు నల్పదియు నైదు
హాయనములు జూలయి మాసమందు భువిని
యేసునాయక శతకంబు నిది ప్రణీత
మయ్యె చౌదరి పురుషోత్తమాఖ్యు వలన.

తాత్పర్యము

ఆన 1845 సం॥ జూలైనెలలో చౌదరి పురుషోత్తము ఈ యేసునాయక
శతకమును రచియించెను.